క్లుప్తంగా

వైద్య సేవలకు చక్కటి స్పందన



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ అనసూయ

డాబాగార్డెన్స్: స్నేహ సంధ్యా ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ గురువారం పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించే ఉచిత వైద్య సేవలకు స్పందన లభించింది. వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ అనసూయ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అందరూ క్రమం తప్పకుండా మందులు వాడాలని, శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. వైద్య శిబిరంలో పుండరీ, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, మౌనిక, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా గొప్ప మానవతావాది



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బాపూ ఆనంద్ తదితరులు

అల్లిపురం : రతన్ టాటా గొప్ప మానవతావాది అని దేవకీనంద ట్రస్ట్ ఫౌండర్ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ అన్నారు. రతన్ టాటా మృతి చెందిన సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొని టాటా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 86 సంవత్సరాల రతన్‌టాటా తన సంపాదనలో దాదాపు 65 శాతం ఛారిటీ కార్యక్రమాలకు ఉపయోగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆయనను చూసి మిగిలిన బడా పారిశ్రామిక వేత్తలు నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా అంబానీ, ఆదానీ లాంటి కుటుంబాలు దేశ ప్రజల సొమ్ముతో కోట్లు సంపాదించి విచ్చలవిడిగా సంబరాలు చేసుకోవడం చూశామన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రతన్‌టాటాకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కేజీహెచ్ ఏడీ రక్తదానం



రక్తదానం చేస్తున్న ఏడీ శ్రీనివాస్ కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం స్వయంగా రక్తదానం చేశారు. దీంతో సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ మేనేజర్ పి.ఎం. జవహర్, ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సిటీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది నూకరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఈఐటీ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న యూఐడీఏఐ అధికారులు

మహారాణిపేట: ఆధార్ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించే యూఐడీఏఐ కేంద్రాన్ని గురువారం అధికారులు పరిశీలించారు. ద్వారకానగర్‌లో ఉన్న ఈ కేంద్రంపై చాలా ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ తప్పిదాలు గుర్తించినట్టు తెలిపారు. యూఐడీఏఐ అధికారులపై కూడా ఇక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్టు తెలిసింది. యూఐడీఏఐ ప్రాజెక్టు మేనేజర్ జావీద్, సచివాలయ ఆధార్ కోఆర్డినేటర్ ఈ కేంద్రాన్ని పరిశీలించారు.

పౌష్టికాహారమే శ్రీరామరక్ష

- తల్లీబిడ్డల ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాల కృషి
- మురికివాడల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- పాఠశాలలు, కళాశాలల ద్వారా గర్భిణులకు అవగాహన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



పుట్టిన బిడ్డ బరువు చూస్తున్న అంగన్‌వాడీ టీచర్ అరుణ



గర్భిణీకి పాలు, గుడ్లు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్

జగదాంబ: గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. అయినప్పటికీ రక్తహీనత, బరువు లేకపోవడం వంటి సమస్యలను అధిగమించేందుకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆకుకూరలు, పళ్లు, కాయల వల్ల కలిగే ఉపయోగాలను గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తెలియజేస్తున్నారు. ఈ విషయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ తగిన చర్యలు తీసుకుని పోషకాహారం గురించి తెలియజేస్తోంది. జీవీఎంసీ 35వ వార్డులో కల్లుపాకలు ప్రాంతంలో 2, ప్రసాద్‌గార్డెన్స్‌లో 2, వెలంపేటలో 1, ఫ్లవర్ స్ట్రీట్, మేదరవీధిలో 2, పండావీధి తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు రెండు వందల మంది చిన్నారులు, 70 మంది వరకు గర్భిణులు, 75 మంది వరకు బాలింతలు సేవలు పొందుతున్నారు. వీరందరికీ పౌష్టికాహారం అందిస్తున్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు రోజూ ఒక గుడ్డుతో పాటు 100 మిల్లీలీటర్ల పాలు అందజేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు బాలామృతం, పాలు, గుడ్లు ఇంటికే పంపిణీ చేస్తున్నారు. 6 నెలల నుంచి రెండేళ్లలోపు పిల్లలకు రెండున్నర కేజీల బాలామృతం పిండి, నెలకు 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు.

మురికివాడలే ప్రధానం..

మురికి వాడల్లో నివసించే వారిలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడంతో ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో తెలియదు కనుక వారికి సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలను స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఈ విషయంలో కళాశాలలు, పాఠశాలలను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు. వారు పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. తద్వారా మురికివాడల్లోని మహిళలు, బాలింతలు, గర్భిణులకు కూడా పౌష్టికాహారంపై చక్కటి అవగాహన ఏర్పడుతోంది.

పోర్టిఫైడ్ బియ్యం, ఆకుకూరలపై అవగాహన..

పోర్టిఫైడ్ బియ్యం, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ టీచర్లు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ బియ్యంలో ఉండే విటమిన్–బి12, ఫోలిక్ యాసిడ్ వంటివి ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయని అవగాహన కల్పిస్తున్నారు. ఆకుకూరలతో పాటు పప్పు వండి బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్నారు. తల్లీపిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి కృషి చేస్తున్నారు. బియ్యం, గోధుమలు, జొన్నలు, సజ్జలు, పెసలు, నువ్వులు, వేరు సెనగ వంటివి తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నాం. మరో పక్క గర్భిణులు, బాలింతలు రక్తహీనత, తక్కువ బరువు వంటి సమస్యలతో బాధ పడకుండా తగిన అవగాహన కల్పిస్తున్నాం. మా కేంద్రంలో అందరు పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకుంటున్నారు.

– అరుణ, పండావీధి అంగన్‌వాడీ కేంద్రం టీచర్, 35వ వార్డు

నిరాశ్రయ వసతి గృహాలకు పోలీసు మద్దతు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ



నిరాశ్రయ వసతి గృహ నిర్వాహకులతో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం : నిరాశ్రయ వసతి గృహాలకు పోలీసుల మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ సిబ్బంది, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ డిపార్టుమెంట్ నుంచి నిరాశ్రయుల సంరక్షణకు తమ మద్దతు ఉంటుందన్నారు. అక్టోబర్ చివరి శనివారం నాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో జరిగే సమావేశంలో ఏయూటీడీని ఆహ్వానించి నిరాశ్రయుల సమస్యల పట్ల చర్చిద్దామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఏయూటీడీ సిబ్బందికి సత్కారం..

ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, ఆర్‌పీపీ కీర్తిరెడ్డి, పి.లావణ్య, శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు హరీష్, గౌతమ్, మేనేజర్ జ్యోతిర్మయి, మేనేజర్ భాస్కరరావు, ధనలక్ష్మి, శ్రీనివాసరావు, ప్రశాంత్ ఆచారి, జీవీఆర్ మూర్తి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏయూటీడీ కార్యదర్శి మాట్లాడుతూ విశాఖలో ఏయూటీడీ ఆధ్వర్యంలో భీమ్‌నగర్‌లో ఒకటి, టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఒకటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు షెల్టర్లలో 180 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. షెల్టర్ల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 6442 మంది అభాగ్యులకు పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఈ షెల్టర్లు పారదర్శకంగా పని చేయడం వలన చాలామందికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడు కోరాడ దాసుకు నగదు అందిస్తున్న శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆదేశాల మేరకు గురువారం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కోరాడ దాసుకు పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ రూ. 5 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, వార్డు ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ విషయంలో పార్టీ శ్రేణులు ఎలాంటి ఆందోళనకు గురి కారాదని తెలిపారు.

మాజీ సీఎం జగన్‌తో వాసుపల్లి భేటీ

శ్రీవారి పంచలోహ విగ్రహం బహూకరణ



మాజీ సీఎం జగన్‌కు శ్రీవారి పంచలోహ విగ్రహం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ గురువారం విజయవాడ కార్యాలయంలో భేటీ అయ్యారు. పలు రాజకీయ అంశాలపై మాజీ సీఎంతో వాసుపల్లి గణేష్ కుమార్ కాసేపు చర్చించారు. మత్స్యకారులకు అందాల్సిన భరోసా పట్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జగన్ సూచించారన్నారు. మత్స్యకారులకు జగన్ ఎంతో అండగా నిలిచారని, అటువంటిది ఎన్నికల ముందు చంద్రబాబు మత్స్యకారులకు రూ. 10 వేలు ఇస్తున్న భరోసా రూ. 20 వేలకు పెంచుతామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. మత్స్యకార భరోసాను విస్మరించిందని విమర్శించారు. విజయవాడ వరదల సమయంలో ప్రభుత్వం మత్స్యకార గజ ఈతగాళ్ల సాయం తీసుకుని ఉంటే ప్రజలకు సత్వర సేవలు అందేవన్నారు. వారికి కూడా తాత్కాలిక ఉపాధి దొరికేదని అభిప్రాయపడ్డారు. జగన్‌కు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, త్వరలో ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ ముఖ్యమంత్రి అయి అండగా నిలవనున్నారని వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీవారి పంచలోహ విగ్రహాన్ని వాసుపల్లి జగన్‌కు అందజేశారు.

12న విజయదశమి ఉత్సవం.. రావణ వధ



మాట్లాడుతున్న శ్యామమాధవ దాస

డాబాగార్డెన్స్ : ఈ నెల 12న విజయదశమిని పురస్కరించుకుని గంభీరంలో గల హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో పెద్ద ఎత్తున విజయదశమి ఉత్సవాలు, రావణ వధ నిర్వహించనున్నట్టు హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామమాధవ దాస పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో తొలిసారిగా విజయ దశమి ఉత్సవాలు జరుగుతాయన్నారు. బాణసంచాతో తయారు చేసిన 20 అడుగుల ఎత్తుగల రావణ వధను హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. త్రేతాయుగాన విజయదశమి రోజున రావణునిపై శ్రీరామచంద్రుని విజయానికి సంకేతంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ ఉత్సవం అత్యంత వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తొలిసారిగా విశాఖలో జరుపుకోవడం విశిష్టంగా భావిస్తున్నామన్నారు. రామ అష్టోత్తర హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీరామలీలా ప్రవచనం, మంగళ హారతి, రావణ వధ అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలతో ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న రేణుక యల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం : కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావుతో కలసి ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, ఆలయ ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బడే నాగరాజు, సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, మధు, వాసుపల్లి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ

విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న వాసుపల్లి



విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : కనకదుర్గమ్మ చల్లని చూపుతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని విజయవాడ దుర్గమ్మను వేడుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విజయవాడ, ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి తప్పకుండా అధికారం చేపడతారన్నారు.

బెంగాలీ సంస్కృతికి విశిష్ట స్థానం



దసరా వేడుకల్లో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ దంపతులు

అల్లిపురం: మాతృభాషకి ఇచ్చే ప్రాధాన్యత, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగేందుకు చేసే కృషి బెంగాలీలను విశిష్ట స్థానంలో నిలిపినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. రైల్వేస్టేషన్ దరి కాళీబరి మందిర్‌లో వాల్తేర్ కాళీ బరి, సర్బో జనిన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే దుర్గా పూజా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఆయన సతీ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 64 ఏళ్లగా కాళీబరిలో దుర్గా పూజా ఉత్సవాలు నిర్వహించడం అపూర్వ విషయమన్నారు. నగర ప్రజలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటానన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సతీమణి బెంగాలీ గీతం ఆలపించి ఆహూతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సుమిత్ బెనర్జీ, జయదేవ్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు బిమల్ దర్, కోశాధికారి ప్రహ్లాద్ మజుందార్, ప్రాంతీక్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

• అడ్డుకట్ట పడేదెలా?



ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు ఉక్కుపాదం మోపినా ఫలితం కనిపించడం లేదు. ఏ గల్లీలో చూసినా చిన్నచిన్న షాపుల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతోంది. అందులో భాగంగా టౌన్ కొత్తరోడ్డు మెయిన్ రోడ్డులోని ఒక కాలువ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా దర్శనమిచ్చాయి.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• చల్లచల్లగా..



ఎండల తీవ్రత నుంచి ప్రయాణికులను కాపాడడం కోసం నియోజకవర్గ పరిధిలోని ఒక ఆటో డ్రైవర్ వినూత్న ఆలోచన చేశాడు. తన ఆటోపై కొబ్బరి కొమ్మలు పెట్టుకొని ఇలా ఆటో నడుపుతూ చల్లచల్లగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాడు.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కరుణ చూపవే.. జగదేకమాత

- కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు



శాకంబరీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ



శివరామకృష్ణ దేవస్థానంలో దుర్గమ్మగా ఉమాదేవి



దుర్గాదేవిగా అనఘాలక్ష్మీదేవి



దుర్గాదేవి అలంకరణలో వెలంపేట దుర్గాలమ్మ

అల్లిపురం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శాకంబరీదేవిగా సాగర గిరి దుర్గమ్మ..

యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని శాకంబరీదేవిగా పలురకాల కాయగూరలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

దుర్గాదేవిగా ఉమాదేవి..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు, విశేష పూజలు నిర్వహించారు.

అనఘాలక్ష్మీ దేవి ఆలయంలో..

వివేకానందకాలనీలోని శ్రీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మీ, రాజశ్యామల, వారాహి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా అమ్మవారు భక్తులకు కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

దుర్గాదేవిగా వెలంపేట దుర్గాలమ్మ..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఎనిమిదో రోజుకి చేరాయి. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. భవనామాల ధార భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. శుక్రవారం మహిషాసురమర్దినిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నవరాత్రుల పూజా రుసుం రూ.200

నవరాత్రుల పూజ చేయించుకునే భక్తులు, వారి గోత్ర నామాలు తెలిపి దేవస్థానంలో ముందుగా రూ.200 పూజా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.